
సాక్షి
గుంటూరు
సోమవారం । 5 । మే । 2025



బల్లలు బహూకరణ

పెదకాకాని: పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానానికి తక్కెళ్లపాడుకు చెందిన కోటేశ్వరరావు, అరుణకుమారి దంపతులు స్టీల్ బల్లలు బహూకరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 513.90 అడుగుల వద్ద ఉంది. ఇది 138.3868 టీఎంసీలకు సమానం.



ఆకట్టుకున్న నృత్యప్రదర్శన

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం నృత్య ప్రదర్శన నిర్వహించారు. నాట్య గురువులను సత్కరించారు.

న్యూస్‌రీల్

భావన్నారాయణస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పొన్నూరు: పట్టణంలోని సుందరవల్లీ సమేత సాక్షి భావన్నారాయణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాతసేవ, స్వామి, అమ్మవార్లకు పంచామృత స్నపన జరిపారు. స్వామివారు పెండ్లికుమారుని అలంకరణలో దర్శనమిచ్చారు. సాయంత్రం నాదస్వర కచేరీ, వేద పఠనం, అనంతరం విశ్వక్సేన పూజ, పుణ్యాహం, రుత్విగ్వరణం, అంకురారోపణం, హోమం, బలిహరణం, ధ్వజారోహణం నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

భగీరథ మహర్షికి ఘననివాళి



గుంటూరు వెస్ట్: భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ, జిల్లా అధికారులు పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని భగీరథ మహర్షి కీర్తిని వివరించారు. నాయీ బ్రాహ్మణ సంక్షేమ, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, బీసీ సంక్షేమ శాఖాధికారి కె.మయూరి, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి షూటింగ్‌లో ముఖేష్‌కు రెండు స్వర్ణాలు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరుకు చెందిన షూటర్ ముఖేష్ నేలవల్లి రెండు బంగారు పతకాలు సాధించాడు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరుగుతున్న 23వ కుమార్ సరేంద్ర సింగ్ మెమోరియల్ నేషనల్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఆదివారం జరిగిన పోటీలో 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ సీనియర్, జూనియర్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు కైవసం చేసుకున్నాడు. ఇదే పోటీల్లో గత శుక్రవారం కూడా 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్‌లోనూ ముఖేష్ బంగారు పతకం సాధించాడు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్లను ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. ఆది దంపతులైన దుర్గామల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో పెద్ద ఎత్తున ఉభయదాతలు పాల్గొన్నారు. భక్తుల తాకిడితో అంతరాలయ దర్శనం నిలిపివేసిన ఆలయ అధికారులు, భక్తులకు బంగారు వాకిలి దర్శనం కల్పించారు. రూ.300, రూ.100 టికెట్లతో పాటు సర్వ దర్శనం క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం 6 గంటల నుంచే భక్తులతో క్యూలైన్లు నిండిపోగా, మహా మండపం వైపు నుంచి వచ్చే భక్తులను 5వ అంతస్తు వరకే లిఫ్టులో అనుమతించారు. అక్కడి నుంచి మెట్ల మార్గం ద్వారా భక్తులు కొండపైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

తడిసి ముద్దయ్యారు..

ఆదివారం ఉదయం కురిసిన భారీ వర్షంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఘాట్‌రోడ్డు మీదగా కొండపైకి చేరుకున్న భక్తులు వర్షంతో తడిసి ముద్దయ్యారు.

ఘాట్‌రోడ్డు మూసివేత..

ఆదివారం ఉదయం 8 గంటలకు భారీ వర్షం కురవడంతో దుర్గగుడి ఘాట్‌రోడ్డును ఆలయ అధికారులు మూసివేశారు. సుమారు గంట పాటు ఏకధాటిగా కురిసిన వర్షంతో కొండ రాళ్లు విరిగిపడే ప్రమాదం ఉందని దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులు భావించారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఘాట్‌రోడ్డుపైకి ఎటువంటి వాహనాలను అనుమతించలేదు.

సజావుగా నీట్

- 97.71 శాతం హాజరు నమోదు
- పరీక్ష కేంద్రాల వద్ద విస్తృత తనిఖీలు



విద్యార్థినికి ఫేస్ స్కాన్ చేస్తున్న సిబ్బంది

గుంటూరు ఎడ్యుకేషన్: వైద్య విద్య కోర్సుల జాతీయస్థాయి అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్–యూజీ 2025) ఆదివారం పూర్తిస్థాయి భద్రతా ఏర్పాట్ల మధ్య సజావుగా జరిగింది. గుంటూరు, తెనాలిలో ఏర్పాటు చేసిన 16 కేంద్రాల పరిధిలో 97.71 శాతం హాజరు నమోదైంది. నీట్‌కు దరఖాస్తు చేసిన 4,250 మంది విద్యార్థుల్లో 4,153 మంది హాజరయ్యారు. విద్యార్థులను విస్తృత రీతిలో తనిఖీ చేసిన తరువాతే కేంద్రాల్లోకి అనుమతించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష సజావుగా జరిగింది. విద్యార్థులను వెంట పెట్టుకుని తల్లిదండ్రులు ఉదయం 10 గంటల నుంచే కేంద్రాలకు చేరుకోవడం ప్రారంభించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విద్యార్థుల వస్త్రధారణ, ఆభరణాలపై విధించిన ఆంక్షలతో పరీక్ష కేంద్రానికి చేరుకునే ముందుగానే విద్యార్థులు సంబంధిత వస్తువులను ఇంటి వద్దే తీసి వేసి వచ్చారు. నీట్ పర్యవేక్షణకు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పర్యవేక్షణలో ప్రతి కేంద్రం పరిధిలో పరిశీలకులుగా నియమించిన తహసీల్దార్‌తో పాటు ఎన్‌టీఏ నుంచి నియమించిన మరొక పరిశీలకులు ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌ను సమన్వయం చేసుకుని పరీక్షను నిర్వహించారు.



ప్రభుత్వ మహిళా కళాశాలలో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు

బీభత్సం.. అస్తవ్యస్తం

- తాడేపల్లి, మంగళగిరి ప్రాంతాల్లో భీకర ఈదురుగాలులు
- పలుచోట్ల విరిగిన కరెంటు స్తంభాలు, తెగిన విద్యుత్ తీగలు
- గాల్లోకి ఎగిరిన హోర్డింగ్‌లు, ఇళ్ల పైకప్పులు
- నేలకొరిగిన చెట్లు
- విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం



ఉండవల్లి ఎస్సీ కాలనీకి వెళ్లే కరకట్ట వెంబడి గాలికి ఎగిరిపోయిన ఇంటి పైకప్పు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం కురిసిన భారీ వర్షం భీభత్సం సృష్టించింది. పలు ప్రాంతాల్లో ఇంటి పైకప్పులు గాల్లోకి ఎగిరాయి. రోడ్డుపక్కన ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు నేలకు ఒరిగాయి. విద్యుత్ స్తంభాలు గాలి విరిగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద నీడ కోసం ఏర్పాటు చేసిన ఐరన్ షెల్టర్లు ఏర్పాటు చేసిన ప్రాంతం నుంచి 10 అడుగుల దూరం వరకు వెళ్లాయి. తాడేపల్లి పట్టణ పరిధిలోని పాత జాతీయ రహదారి వెంబడి స్పెన్సర్ దగ్గర నుంచి ఉండవల్లి సెంటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు విరిగి తాత్కాలికంగా రాకపోకలకు ఇబ్బంది కలిగింది. వర్షం తగ్గుముఖం పట్టిన తరువాత స్థానికులు ఆ చెట్లను తొలగించారు. రోడ్డు పక్కన పలు నివాసాలపై ఏర్పాటు హోర్డింగ్‌లు గాల్లోకి ఎగిరిపోయాయి. నులకపేట తెల్ల క్వారీ, మదరసా, ఎర్రక్వారీ ప్రాంతాల్లో చెట్లు విరిగి ఇళ్లపై పడి రేకులు పగిలిపోయాయి. ఉండవల్లి ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో ఓ ఇంటి పైకప్పు పూర్తిగా గాల్లోకి ఎగిరి గోడలు కూలాయి. ఉండవల్లిలోని పుష్కరాల కాలనీలో గాలివాన బీభత్సానికి ఇంటి పైకప్పులు పైకి లేచిపోయాయి. సీతానగరంలో రెండు చోట్ల ఇంటి పైకప్పు గాల్లోకి ఎగిరాయి. మండలంలోని పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. తాడేపల్లి పట్టణ రూరల్ పరిధిలో నాలుగు విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉండగా 25 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఉండవల్లిలో 6 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కూలిపోయింది. విద్యుత్‌శాఖ సిబ్బంది యుద్ధప్రాతిపదిక పనులు చేపట్టి సాయంత్రం 6 గంటలకల్లా పలుచోట్ల విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న నివాసాల్లోకి డ్రైనేజీలు పొంగి మురుగునీరు ఇళ్లముందు వరకు వచ్చాయి.



విద్యుత్‌తీగలపై పడిన చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

పంటలకు నష్టం

మంగళగిరి: నగరంలో ఆదివారం ఉదయం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి భారీగా ఉరుములు, మెరుపులు వస్తూ ఈదురుగాలులతో వర్షం ప్రారంభమైంది. దీంతో జనం భయకంపితులయ్యారు. ఈదురుగాలుల దెబ్బకు కొబ్బరి చెట్లు, తాటి చెట్లు విరిగిపడ్డాయి. మండలంలోని నూతక్కి, రామచంద్రాపురం గ్రామాలల్లోని తోటల్లో అరటి మొక్కలు నేలకొరిగాయి.

వాణిజ్య పంటలపై తీవ్ర ప్రభావం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్‌పరిధిలో ఆదివారం ఉదయం కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షం వాణిజ్య పంటలపై తీవ్ర ప్రభావం చూపింది. తాడేపల్లి పట్టణ, రూరల్‌లో వాణిజ్య పంటలైన పసుపు, కందతో పాటు అరటిని రైతులు ఎక్కువగా పండిస్తారు. పంట చేతికొచ్చే సమయానికి ఇలాంటి అనుకోని విపత్తులు రావడంతో భారీ నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 300 హెక్టార్లలో అరటిపంట వేయగా 100 నుంచి 150 హెక్టార్లలో అరటి తోటల్లో గెలలు వచ్చాయి. ఎండాకాలం గాలితాకిడికి అరటిచెట్లు పడకుండా రైతులు వెదురుబొంగులను సైతం ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ఈదురుగాలుల బీభత్సానికి సగానికి పైగా అరటిచెట్లు నేలకొరిగాయి. అంతేకాకుండా ఈదురుగాలి వల్ల గెలరాని చెట్లకున్న మొవ్వాకు సైతం పాడైపోయిందని, దీని వల్ల అరటిగెల సైజు తగ్గడమే కాకుండా పంట దిగుబడి తగ్గుతుందని రైతులు వాపోయారు. కళ్లాల్లో ఆరబెట్టిన పసుపు పూర్తిగా తడిచిపోయింది.



నూతక్కిలో నేలవాలిన అరటి మొక్కలు

మరణంలోనూ వీడని బంధం

- రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకులు మృతి
- ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలో ప్రమాదం
- గుంటూరు నుంచి తిరుమలకు మొక్కు తీర్చుకునేందుకు వెళుతుండగా ఘటన



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పావని, కుమారుడు చంద్రకౌశిక్ (ఫైల్)



రోదిస్తున్న కుటుంబసభ్యులు

పెదకాకాని: 16వ నంబరు జాతీయ రహదారిపై ఒంగోలు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కొప్పురావూరు గ్రామానికి చెందిన ఇద్దరు తల్లీకొడుకులు మృతిచెందారు. ఒంగోలు సమీపంలోని కొప్పోలు ఫ్లై ఓవర్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. కొప్పురావూరు గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ తిరుమలశెట్టి కృష్ణ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె లావణ్యను అమరావతికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బూసి వినయేంద్రకు ఇచ్చి వివాహం చేశాడు. వారి రెండేళ్ల బాబు లోక్షిత్‌కు పుట్టు వెంట్రుకలు సమర్పించేందుకు ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకు గుంటూరు నుంచి తిరుపతికి కారులో బయలు దేరారు. వినయేంద్ర కారులో వారికి సైతం మొక్కు ఉండడంతో గుంటూరులో ఉంటున్న ఆర్‌ఎంపీ కృష్ణ పెద్ద అన్నయ్య కుమారుడు తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు, ఆయన భార్య పావని(40), వారి చిన్నకుమారుడు చంద్రకౌశిక్(15)లు సైతం ఎక్కారు. వారు ప్రయాణిస్తున్న కారు ఆదివారం సుమారు 4:30 గంటల సమయంలో ఒంగోలు సమీపంలోని కొప్పోలు ఫ్లై ఓవర్ దాటిన తరువాత ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఆగి ఉన్న లారీ వెనుక కారు ఆపారు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కంటైనర్ లారీ ఒక్కసారిగా కారును ఢీ కొంది. ఈ ఘటనలో కారు ముందు ఉన్న లారీకి ఢీకొన్న కంటైనర్ మధ్య నుజ్జునుజ్జు అయింది. కారులో ప్రయాణిస్తున్న ఆరుగురిలో తిరుమలశెట్టి పావని, ఆమె కుమారుడు చంద్రకౌశిక్ సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. కారులో ప్రయాణిస్తున్న బూసి లావణ్య, వినయేంద్రకు తీవ్రగాయాలు కాగా వారిలో వినయేంద్ర పరిస్థితి విషమంగా ఉంది. వారి కుమారుడు రెండేళ్ల లోక్షిత్, మేనమామ తిరుమలశెట్టి వెంకటేశ్వరరావులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

కొప్పురావూరులో విషాదం..

తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు దంపతులకు ఇద్దరు కుమారులు. వారిలో పెద్ద కుమారుడు వెంకట హర్షవర్ధన్ హైదరాబాద్‌లో చదువుకుంటున్నాడు. చిన్న కుమారుడు చంద్రకౌశిక్ గత నెలలో విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 576 మార్కులు సాధించాడు. దీంతో తలనీలాలు సమర్పించేందుకు తిరుమల బయలు దేరాడు. వారు ప్రయాణిస్తున్న కారును కంటైనర్ లారీ మృత్యువు రూపంలో వెంటాడింది. తల్లీకుమారులు మృత్యువాత పడడంతో కొప్పురావూరులో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆర్‌ఎంపీ కృష్ణ చిన్న కుమార్తెకు మూడు నెలల క్రితమే వివాహం జరిగింది. ఇంటి ముందు వేసిన పందిరి కూడా తీయలేదు. ఇంతలోనే ఊహించని విషాదంతో ఆ కుటుంబాలు శోకసముద్రంలో మునిగిపోయాయి.

సర్దుమణిగిన వర్గపోరు!

- శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి కమిటీ ఇరు వర్గాలతో సమావేశమైన జిల్లా ఎస్పీ
- స్వయం ప్రకటిత పాలకవర్గం చెల్లదని స్పష్టీకరణ
- హైకోర్టులో వ్యాజ్యం వేసి, సర్వసభ్య సమావేశం ఎలా జరుపుతారని ప్రశ్న
- హైకోర్టు ఆదేశాలు వచ్చేవరకు ఇరు వర్గాలు కార్యకలాపాలు నిలిపివేయాలి
- తాత్కాలికంగా తటస్థులకు ఆలయ కార్యక్రమాల నిర్వహణ
- ఎస్పీ సూచనకు ఇరువర్గాల అంగీకారం



సభ్యుల సమక్షంలో ఎస్పీ ఆదేశాలను వెల్లడిస్తున్న ఆలయ కమిటీ నేతలు

తెనాలి: శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం సత్రం కమిటీ వివాదం సద్దుమణిగింది. దేవస్థానం కమిటీ, స్వయం ప్రకటిత పాలకవర్గం రెండూ తమ కార్యకలాపాలను నిలుపుదల చేశాయి. వివాదం హైకోర్టులో ఉన్నందున, కోర్టు ఉత్తర్వుల ప్రకారం నడుచుకునేలా అంగీకారం తెలియజేశారు. అప్పటివరకు అందరికీ సమ్మతమైన డబుల్‌హార్స్ మినపగుళ్ల అధినేత మునగాల మోహన్‌శ్యాం ప్రసాద్ ఆలయ నిర్వహణ బాధ్యతలను చూసుకుంటారు. గుంటూరు జిల్లా ఎస్పీ సమక్షంలో ఆయన ఆదేశాలపై కుదిరిన ఒప్పందమిది. ఎస్పీ సూచనలకు ఇరువర్గాలు సమ్మతిని తెలియజేశాయి.

జిల్లా ఎస్పీ నుంచి పిలుపు..

శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం కమిటీ వివాదం, వరుస పరిణామాల నేపథ్యంలో ఆలయ కమిటీ ఆదివారం సర్వసభ్య సమావేశానికి సభ్యులకు నోటీసులు పంపిన విషయం తెలిసిందే. ఆ ప్రకారం కమిటీ నేతలు మీడియాకు వెల్లడించారు. స్వయం ప్రకటిత పాలకవర్గం నేతలు సర్వసభ్య సమావేశం చెల్లదని, సభ్యులు ఎవరూ హాజరుకావొద్దని మీడియాకు చెప్పారు. ఈ తరుణంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ నుంచి ఇరువర్గాలకు పిలుపువచ్చింది. శనివారం రాత్రి ఏడున్నర గంటల తర్వాత అక్కడకు చేరుకున్నారు. ఎస్పీ సూచనపై ఆలయ కమిటీ నుంచి అయిదుగురు, స్వయం ప్రకటిత పాలకవర్గం నుంచి అయిదుగురు చొప్పున హాజరయ్యారు. అధికారులు మరో ఆరుగురు, న్యాయసలహాదారు సమావేశంలో పాల్గొన్నారు.

ఇరువర్గాలను ప్రశ్నించిన ఎస్పీ

ఆలయానికి చెందిన ఇరు వర్గాలకు జిల్లా ఎస్పీ క్లాస్ పీకారు. ముందుగా స్వయంప్రకటిత పాలకవర్గాన్ని ప్రశ్నించారు. గత నెల 13న జరగాల్సిన సర్వసభ్య సమావేశం రసాభాస కావటంతో పోలీసుల అనుమతితోనే వాయిదా వేసినట్టు గుర్తుచేశారు. ఆ ప్రకారం మరోసారి తేదీని నిర్ణయించి సభ్యులకు నోటీసులు జారీచేసి సమావేశం నిర్వహించాల్సి ఉందని గుర్తుచేశారు. అందుకు భిన్నంగా రెండురోజుల్లోనే 300 మందికి పైగా సంతకాలు తీసేసుకుని పాలకవర్గంగా ఎన్నికయ్యామంటే ఎలా చెల్లుతుందని ఎస్పీ ప్రశ్నించారు. మొత్తం 1100 వరకు గల సభ్యుల్లో 200 మంది వరకు మరణించి ఉంటారనుకుంటే మిగిలినవారిలో 600 మంది ఆలయ కమిటీ పక్షాన ఉన్నట్టా? అని కూడా ఎస్పీ ప్రశ్నించినట్టు విశ్వసనీయ సమాచారం. బైలా ప్రకారం జరగని ఎన్నిక ఎలా చెల్లుబాటవుతుందని ప్రశ్నిస్తూ, మళ్లీ ఆ పాలకవర్గం ప్రమాణస్వీకారానికి చట్టబద్ధత ఏముంటుందని కూడా అడిగారు.

- అదేవిధంగా స్వయంప్రకటిత పాలకవర్గం ఎన్నిక, ఇతర అంశాలపై హైకోర్టును ఆశ్రయించిన ఆలయ కమిటీ ఇప్పుడు సర్వసభ్య సమావేశం ఎలా జరుపుతుందని కూడా ఎస్పీ ప్రశ్నించారు. ఇదికూడా మరొక వివాదం అవుతుందన్నారు. హైకోర్టు ఆదేశాలు వచ్చేవరకు రెండు వర్గాలు ఎలాంటి కార్యకలాపాలకు పాల్పడవద్దని ఎస్పీ స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

శ్యాంప్రసాద్‌కు తాత్కాలిక బాధ్యతలు

ఈలోగా జరగాల్సిన శ్రీవాసవీ అమ్మవారి జన్మదిన వేడుకల నిర్వహణకు ఇద్దరికీ ఆమోదయోగ్యమైన తటస్థుల పేర్లను చెప్పమని ఎస్పీ చేసిన సూచనపై ఆలయ కమిటీ వర్గం ఆర్యవైశ్య ప్రముఖుడు నంబూరు వెంకట కృష్ణమూర్తి పేరును సూచించింది. స్వయం ప్రకటిత పాలకవర్గం నేతలు పెండేల వెంకట్రావు, తాతా శ్రీనివాసరావులు కృష్ణమూర్తి పేరుకు అభ్యంతరం తెలియజేశారు. దీంతో డబుల్ హార్స్ మినపగుళ్ల అధినేత మునగాల మోహన్ శ్యాంప్రసాద్ పేరును చెప్పారు. ఇందుకు పెండేల వెంకట్రావు వర్గం అంగీకారం తెలియజేసింది. హైకోర్టు ఆదేశాలు వచ్చేవరకు మోహన్ శ్యాంప్రసాద్ ఆలయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారని ఎస్పీ వెల్లడించారు. రాత్రి పొద్దుపోయే వరకు ఈ సమావేశం కొనసాగింది. ఇదిలావుంటే, ఆదివారం ఉదయం 10.30 గంటలకు సర్వసభ్య సమావేశానికి నోటీసులు అందుకున్న దేవస్థానం కమిటీ సభ్యులు వందలాదిమంది ఆలయ ప్రాంగణానికి వచ్చారు. అక్కడకు వచ్చాక సమావేశం లేదని తెలుసుకుని తిరుగుముఖం పట్టారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు ఆకి అచ్యుతరావు, వుప్పల వరదరాజులు, దేసు శ్రీనివాసరావు, కొణిజేటి గోపీకృష్ణ, మద్దాళి శేషాచలం తదితరులు జిల్లా ఎస్పీ సూచనలపై సర్వసభ్య సమావేశం నిర్వహించటం లేదని మీడియాకు వెల్లడించారు. అలాగే మునగాల మోహన్‌శ్యాంప్రసాద్ పర్యవేక్షణలో అమ్మవారి జన్మదిన ఉత్సవాలు జరుగుతాయని చెబుతూ ఆర్యవైశ్యులు వర్గాలకతీతంగా సమష్టిగా పాల్గొని వేడుకలను జయప్రదం చేసి, అమ్మవారి ఆశీస్సులను పొందాలని కోరారు.

ముగిసిన ప్రతిష్ఠా మహోత్సవాలు



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

దుగ్గిరాల: దుగ్గిరాల మండలం కేఆర్ కొండూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మంహంకాళి అమ్మవారి దేవస్థాన పునర్నిర్మాణ నూతన రాజగోపుర శిఖర కలశ ప్రతిష్ఠా కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం 5:30 గంటలకు నిత్య పూజావిధులు, యంత్రపూజలు, పీఠన్యాస, గర్తన్యాస, రత్నన్యాసాదులు, 7:49 నిమిషాలకు యంత్రబింబ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, తదితర కార్యక్రమాలు జరిగాయి. ప్రతిష్ఠానంతరం అన్నసంతర్పణ జరిగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మంత్రి నారా లోకేష్ పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, పూజలు నిర్వహించారు. ఆయన వెంట అధికారులు, నాయకులు ఉన్నారు. ఆలయ పునర్నిర్మాణ ప్రధాన దాతలు దొంతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, వాసంతి, శ్రీప్రద్ విశ్వత్ రెడ్డిలు ముఖ మండపం, విమాన గోపురం, రాజ గోపురం, నూతన ధ్వజస్తంభం పరివాహక దేవతలను బహూకరించారు. వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ దేవభక్తుని రంగప్రసాద్ మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణానికి మొత్తం రూ.4 కోట్లు అయ్యిందని, దానిలో ఎండోమెంట్ వారు రూ.కోటి, దాతలు రూ.3కోట్లు సహాయం చేశారని తెలిపారు. దేవస్థాన కార్యనిర్వాహణ అధికారి కె.సునీల్ కుమార్ ఏర్పాట్లు పరిశీలించారు. తహసీల్దార్ ఐ.సునీత, ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు, ఏపీఎం సురేష్ కుమార్ అలయ సిబ్బంది పాల్గొన్నారు. ఎస్ఐ వెంకట రవికుమార్, పోలీసులు బందోబస్తు పర్యవేక్షించారు.



మహంకాళి అమ్మవారు

క్లుప్తంగా

మద్యం మత్తులో రోకలి బండతో దాడి

తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ యువకుడు మృతి


మృతుడు రఘునాథరావు

దుగ్గిరాల: మద్యం మత్తులో రోకలిబండతో మోదడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. శుక్రవారం సాయంత్రం మోరంపూడి గ్రామంలోని వైఎస్సార్ విగ్రహం కూడలి దగ్గర రఘునాథరావు(35), కూచిపూడి గోపి ఇరువురూ పూటుగా మద్యం సేవించారు. అనంతరం ఇద్దరి మధ్య ఘర్షణ చెలరేగింది. ఈక్రమంలో గోపి దగ్గరే ఉన్న ఇంటి నుంచి రోకలిబండ తీసుకువచ్చి రఘునాథ రావు తలపై గట్టిగా కొట్టాడు. దీంతో రఘునాథరావు కుప్పకూలిపోయాడు. కొన ఊపిరితో ఉన్న రఘునాథరావును చికిత్స నిమిత్తం తెనాలి ప్రభుత్వ హాస్పటల్‌కి తరలించారు, అక్కడి నుంచి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం ఆదివారం సాయంత్రం అంత్యక్రియలు ముగిశాయి. మృతుడికి భార్య దివ్య, వరుసగా 7, 5, 2 సంవత్సరాలు వయసున్న శాన్వీ, హిమాన్వీ, జస్వీ అనే కుమార్తెలు కలరు. దుగ్గిరాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రోదిస్తున్న రఘునాథరావు కుమార్తెలు

విద్యార్థిని ఆత్మహత్య

లక్ష్మీపురం: బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని సెకండ్ సెమిస్టర్ పరీక్షలకు సరిగ్గా చదవలేకపోయానని మార్కులు తక్కువ వస్తాయనే మనస్థాపంతో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటన ఆదివారం కుందుల రోడ్డులో చోటుచేసుకుంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణనగర్ వైట్ హౌస్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే కల్లూరి హరనాథ్‌బాబు గుంటూరు హౌసింగ్ కార్పొరేషన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తుంటాడు. ఆయనకు ఇద్దరు ఆడ సంతానం ఉన్నారు. పెద్ద కుమార్తె ఇంధు మేఘన (20) ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీలో తృతీయ సంవత్సరం బీటెక్ చదువుతోంది. వారం రోజులుగా పాస్‌పోర్ట్ పనిమీద తిరుగుతూ సెకండ్ సెమిస్టర్‌కు పూర్తిగా సిద్ధం కాలేక పోయింది. ఈనేపథ్యంలో మనస్తాపం చెంది ఇంట్లో గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు వెల్లడించారు. సమాచారం తెలుసుకున్న పట్టాభిపురం ఎస్సై తరంగిణి ఘటనా ప్రదేశంలో ఆత్మహత్య చేసుకున్న వైనాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం జీజీహెచ్‌కు తరలించారు.

ఎస్సీ వెల్ఫేర్‌లో ఇవి మామూళ్లే!

- అవినీతికి కేరాఫ్‌గా ఎస్సీ వెల్ఫేర్ కార్యాలయం
- సిబ్బందిని జలగల్లా పీడిస్తున్న ఉన్నతోద్యోగులు
- పే స్కేల్స్, ఇంక్రిమెంట్లు వేయాలన్న ముడుపులు ఇచ్చుకోవాల్సిందే
- మామూళ్లు ఇచ్చుకుంటేనే ఫైల్ కదిలేది
- లబోదిబోమంటున్న ఉద్యోగులు


ఎస్సీ వెల్ఫేర్ కార్యాలయం

నెహ్రూనగర్: గుంటూరు జిల్లా పరిషత్ సమీపంలోని ఎస్సీ వెల్ఫేర్ కార్యాలయం అవినీతికి కేరాఫ్‌గా మారింది. ఇక్కడి ఉన్నతోద్యోగులు కింది సిబ్బందిని జలగల్లా పీడిస్తున్నారు. ఏ పని చేయాలన్నా ఎంతో కొంత ముట్టచెబితేనే ఫైల్ ప్రాసెస్ అవుతుంది. లేకుంటే ఆ ఫైల్ అలాగే రోజులు, నెలల తరబడి పెండింగ్‌లో ఉంటుంది. దీంతో చాలా మంది ఉద్యోగులు వారు అడిగినంత ఇచ్చుకోలేక, పనులు కాక ఇబ్బందులు పడుతున్నారు.

ఇంక్రిమెంట్లు వేయాలంటే సమర్పించుకోవాల్సిందే...!

ఎస్సీ వెల్ఫేర్ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగుల ఇంక్రిమెంట్లు, ఎస్ఆర్ ఎంట్రీలు, పే ఫిక్సేషన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇతర బిల్లులు ఇలా అన్ని రకాల పనులకు ఒక రేటు ఫిక్స్ చేసి వారి నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా నాలుగో తరగతి ఉద్యోగులను మరిన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని వినికిడి.

ఉన్నతాధికారులు పట్టించుకోరే ?

కార్యాలయంలో ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్న అంశాలపై ఉన్నతాధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. వెల్ఫేర్ శాఖకు రెగ్యులర్ డీడీ మధుసూధన్‌రావు గత కొద్ది నెలలుగా లాంగ్ లీవ్‌లో ఉండటంతో పాటు ప్రస్తుతం ఈ శాఖకు బాపట్ల ఎస్సీ వెల్ఫేర్ అధికారిని ఇన్‌ఛార్జ్ డీడీగా నియమించారు. కార్యాలయంలో జరిగే అన్ని విషయాలకు గతంలో ఇక్కడ పనిచేసిన డీడీ అండదండలు ఉన్నాయని క్లాస్–4 ఉద్యోగులు బహిరంగంగానే మాట్లాడుకోవడం గమనార్హం. దీనిపై ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

నా దృష్టికి రాలేదు

కార్యాలయంలో ఉద్యోగులకు అవసరమైన పనులు చేయాలంటే మామూళ్లు అడుగుతున్న విషయం నా దృష్టికి రాలేదు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

– రాజా దెబోరా, డిప్యూటీ డైరెక్టర్, ఎస్సీ వెల్ఫేర్

వైభవంగా శ్రీభారతి మహోత్సవాలు


శ్రీపర శివానంద భారతీస్వామికి ఉత్తర పీఠాధిపతిగా పట్టాభిషేక మహోత్సవం

నగరంపాలెం: స్థానిక అరండల్‌పేట 4/2వ అడ్డరోడ్డులో కొలువైన శ్రీశృంగేరి శ్రీవిరుపాక్ష శ్రీపీఠంలో నిర్వహిస్తోన్న శ్రీ భారతి మహోత్సవాలు నాలుగో రోజుకి చేరాయి. శ్రీమహా కామేశ్వరి ధర్మ పరిపాలనా సంఘం ఆధ్వర్యంలో జరగ్గా, ఆదివారం నిత్య పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ పీఠాధిష్ఠాత్రి శ్రీ రాజ రాజేశ్వరి ప్రతాప భారతి పరదేవత అనుగ్రహంతో పరమహంస పరివ్రాజకాచార్య జగద్గురు శ్రీ గంభీరానంద భారతిస్వామిచే శ్రీశృంగేరి శ్రీవిరూపాక్ష శ్రీ పీఠానికి శ్రీపరశివానంద భారతి స్వామికి ఉత్తర పీఠాధిపతిగా పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శిష్యులకు తీర్థ ప్రసాద వినియోగం, అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. గంభీరానంద భారతి మహాస్వాములు అనుగ్రహ భాషణం చేశారు. సోమవారం కళ్యాణానంద భారతి మాంతాచార్య మహాస్వామి వారి జయంతి నిర్వహించనున్నారు. కార్యక్రమంలో హిందూ కళాశాల అధ్యక్షులు ఎస్‌వీఎస్ సోమయాజి, ఆడిటర్లు జి.శివరామకృష్ణప్రసాద్, పరమహంస, హైకోర్టు న్యాయవాది కృష్ణప్రసాద్, నగర వైదిక ప్రముఖులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యంతో పట్టుబడిన మినీ లారీ

చేబ్రోలు: మండల పరిధిలో పేదల బియ్యం పక్కదారి పడుతోంది. గత కొంతకాలంగా రేషన్ అక్రమ దందా కొనసాగుతున్నప్పటికీ అడ్డుకట్ట వేయటంలో అధికారులు విఫలమయ్యారు. ఆదివారం తెల్లవారుజామున చేబ్రోలు మండలం మంచాల గ్రామ శివారులోని బ్రాహ్మణ కోడూరు అడ్డరోడ్డు ప్రాంతంలో లారీలో రేషన్ బియ్యంను అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ డి.వెంకటకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది నిఘా వేసి రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని తనిఖీ చేశారు. ఏపీ 39 వీఈ 0256 నెంబరు గల మినీ లారీలో సుమారు వంద బస్తాల రేషన్ బియ్యంను తరలిస్తున్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకొని చేబ్రోలు పోలీసు స్టేషన్‌కు తరలించారు. బాపట్లకు అక్రమ రవాణా చేస్తున్నట్లు మాత్రమే ప్రకటించారు. రేషన్ బియ్యం ఎక్కడ నుంచి ఎక్కడకు వెళ్తుంది.. దీనికి సూత్రధారి వివరాలను మాత్రం అధికారులు వెల్లడించలేదు.

నకిలీల పాపం.. పేదలపై ప్రతాపం

- అవినీతి కంపులో మంగళగిరి కరూర్ వైశ్యాబ్యాంక్
- కూలిపనులు చేసుకునేవారితో ఖాతాలు
- నకిలీ బంగారు ఆభరణాలతో రూ.లక్షల్లో రుణాలు
- మేమెక్కడా తాకట్టు పెట్టలేదంటున్న బాధితులు
- కీలక పాత్ర పోషించిన వడ్డీ వ్యాపారి రాజశేఖరరెడ్డి
- బ్యాంక్ నుంచి నోటీసులు అందడంతో లబోదిబోమంటున్న కూలీలు



మంగళగిరిలోని కరూర్ వైశ్యాబ్యాంక్


ది కరూర్ వైశ్యా బ్యాంకు లిమిటెడ్
బ్యాంకు వారు అందజేసిన నోటీసు

తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని కరూర్ వైశ్యాబ్యాంక్ శాఖ కార్యాలయం నుంచి పలువురు బంగారు రుణాలు తీసుకున్న వారికి నోటీసులు పంపించారు. ఆదివారం అదే బ్యాంక్‌పై 'సాక్షి'లో కథనం వెలువడడంతో బాధితులు ఆ వార్తను చూసి లబోదిబోమంటూ కన్నీరు మున్నీరు అవుతున్నారు. కూలీనాలీ చేసుకునేవారం ఎక్కడ నుంచి అంత డబ్బు తీసుకువచ్చి కట్టాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క బ్యాంక్ అధికారులు అది నకిలీ బంగారం అంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, మరోపక్క తాకట్టు పెట్టిన బంగారు రుణం సమయం అయిపోయింది.. వెంటనే డబ్బులు చెల్లించాలని లేకుంటే ఇళ్లు, వాకిళ్లు వేలం వేసి కేసులు పెడతామంటూ బ్యాంక్ సిబ్బంది బెదిరిస్తున్నట్లు కూలీలు వాపోతున్నారు.

జరిగింది ఇదీ..!

మంగళగిరికి చెందిన రాజశేఖరరెడ్డి అనే రోజువారీ తాపీకూలీ సంవత్సరం క్రితం తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేటకు చెందిన మిగతా తాపీ కూలీలతో పాటు కూలిపనులకు వచ్చాడు. కాలక్రమేణా కొంతమందితో స్నేహం చేసి మంగళగిరి కరూర్ వైశ్యాబ్యాంక్‌లో అకౌంట్ ఓపెన్ చేస్తే లోన్లు ఇస్తారంటూ ఖాతాలు తెరిపించాడు. అనంతరం వారికి తెలియకుండా బ్యాంక్‌లో వారి పేరిట నకిలీ బంగారం తాకట్టుపెట్టి రూ.లక్షల్లో రుణం తీసుకున్నాడు. ఈక్రమంలో వడ్డీలు, అసలు కట్టాలంటూ బ్యాంకు అధికారులు కూలీలకు నోటీసులు పంపించసాగారు. ఇదేంటని రాజశేఖరరెడ్డిని అడిగితే మొత్తం నేను చూసుకుంటాను, మీకేం ఇబ్బంది రాదంటూ కూలీలను మభ్యపెట్టాడు. విషయం బయట పడి రాజశేఖరరెడ్డిని నిలదీయగా, విజయవాడకు చెందిన ఫైనాన్షియర్ టెక్కి ప్రకాష్ చూసుకుంటాడు, మీకు ఎటువంటి ఇబ్బంది ఉండదని చెబుతున్నాడని కూలీలు తెలిపారు. అనంతరం తమ దగ్గరికి మంగళగిరికి చెందిన మదన్, రాజశేఖరరెడ్డి వచ్చి మమ్మల్ని బ్యాంకుకు తీసుకువెళ్లారని, మదన్(బ్యాంక్ జ్యూయలర్ అప్రైజర్)ను చూపించి ఇతనే మనకు రుణాలు ఇప్పించేది అని, లోన్ వచ్చిన తరువాత పర్సంటేజ్ తీసుకుంటామని మమ్మల్ని నమ్మించాడని, ఇప్పుడు బ్యాంకు నుంచి నోటీసులు వస్తుంటే ఏమీ మాట్లాడకుండా మాపై దౌర్జన్యం చేస్తున్నాడని కూలీలు వాపోయారు.

నకిలీ బంగారమైతే ఎందుకు తాకట్టు పెట్టుకున్నారు?

నకిలీ బంగారాన్ని నిజమైన బంగారంగా బ్యాంకు అధికారులు ఎలా తీసుకున్నారో వాళ్లు ముందు సమాధానం చెప్పాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. కూలి పనులు చేసుకునే తమ దగ్గర అంత బంగారం ఎలా ఉంటుందని బ్యాంకు అధికారులు ఎందుకు ఆలోచించలేదంటూ ప్రశ్నిస్తున్నారు. మేం ఒకవేళ ఎవరిదైనా బంగారం తీసుకువచ్చి తాకట్టు పెడితే అది నకిలీ బంగారం అని ఎందుకు చెప్పలేదంటూ నిలదీస్తున్నారు. ఇదే బ్యాంక్‌లో గత సంవత్సర కాలంలో రాజశేఖరరెడ్డితో పాటు మరికొంతమంది ఇలా నకిలీబంగారం తాకట్టు పెట్టి 45 మంది కూలి నాలీ చేసుకునేవారిచేత అకౌంట్ ఓపెన్ చేసి 147 బంగారు తాకట్టు ఖాతాలను తెరిచి తాకట్టు పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం.

కూలి పనులకు వెళ్తేనే కుటుంబం గడుస్తుంది



రోజూ తాపీపనికి వెళితేనే నా కుటుంబం గడుస్తుంది. రాజశేఖరరెడ్డి మాతోపాటు కూలిపనులు చేసుకునేవాడు. కొంచెం చదువుకుని ఉండడంతో మాకు మాయమాటలు చెప్పి లోన్లు వస్తాయని చెప్పి అకౌంట్లు ఓపెన్ చేయించి ఈ పని చేశాడు. ఇప్పుడు ఎవరు బంగారం తాకట్టు పెట్టారని అడిగితే టెక్కి ప్రకాష్, మదన్ అని చెబుతున్నాడు. వారు మాకు ముఖ పరిచయం మాత్రమే. జరిగిన సంఘటనపై అధికారులను, మంత్రులను కలుద్దామని అనుకుంటున్నాం. నా పేరుమీద రూ.35 లక్షల బంగారం లోన్ తీసుకున్నట్లు బ్యాంక్ అధికారులు చెబుతున్నారు.

– ఎస్‌కే మీరావలి, నులకపేట

నమ్మకంగా మోసం చేశాడు.



మనందరి జీవితాలు బాగుపడాలంటే లోన్లు తీసుకుందామంటూ మాతో పాటు పనికి వచ్చే రాజశేఖరరెడ్డి చెప్పాడు. మనం కూడా కాంట్రాక్ట్ తీసుకుని పనులు చేద్దాం అంటూ మాయమాటలు చెప్పాడు. ముందుగా బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేద్దామని చెప్పి ఖాతా తెరవడానికి అవసరమైన రూ.10వేలు అతనే కట్టి, బ్యాంక్ ఖాతా పుస్తకాలు కూడా ఇవ్వలేదు. ఆరు నెలల తరువాత బ్యాంక్ వారు మీరు తాకట్టుపెట్టిన బంగారు రుణం సమయం అయిపోయింది. రిలీజ్ చేసుకోవాలంటూ నోటీసులు పంపిస్తున్నారు. ఇప్పుడు రాజశేఖరరెడ్డిని అడిగితే మాట దాటవేస్తున్నాడు.

– ఎస్‌కె సలీం, నులకపేట

మమ్మల్ని అమ్మినా డబ్బులు కట్టలేం



బ్యాంక్ వాళ్లు రాజశేఖరరెడ్డి మరికొంత మంది చేసిన మోసానికి మమ్మల్ని నిలువునా అమ్మినా బ్యాంకు రుణం తీర్చలేం. నా పేరు మీద రూ.30 లక్షల బంగారం తాకట్టు పెట్టినట్లు అధికారులు చెబుతున్నారు. త్వరలోనే నోటీసులు ఇస్తాం, వెంటనే డబ్బులు చెల్లించకపోతే కేసు పెట్టి మీ ఆస్తులు జప్తు చేస్తామని చెబుతున్నారు. మేం సంతకాలు పెట్టకుండా ఎలా బంగారం తాకట్టు పెట్టుకున్నారు?

– ఎస్‌కే బాజీ, నులకపేట

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించండి

కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి జగన్నాథం



లక్ష్మీపురం: రాష్ట్రంలో కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉందని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.వి జగన్నాథం అన్నారు. గుంటూరు కొత్తపేటలోని కౌలురైతు సంఘం కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి కౌలు రైతులకు ఎటువంటి సహాయ సహకారాలు అందడంలేదని మండిపడ్డారు. గుర్తింపు కార్డులు, ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మే 6వ తేదీన గుంటూరు మల్లయ్య లింగం భవన్‌లో ఉదయం 10 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో కౌలు రైతులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కంజుల విఠల్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళా కూలీ మృతి

బల్లికురవ: పొలంలో కూలీ పనులు చేస్తుండగా పాము కాటు వేయటంతో 30 గంటలపాటు మృత్యువుతో పోరాడి ఆదివారం సాయంత్రం ఓ మహిళాకూలీ మృతి చెందింది. అందిన సమాచారం ప్రకారం.. బల్లికురవ మండలం ఉప్పుమాగులూరు పంచాయతీలోని సోమవరప్పాడు గ్రామానికి చెందిన గార్లపాటి మల్లేశ్వరి (52) కూలీనాలీ పనులు చేస్తూ భర్త కోటేశ్వరరావుకు చేదోడుగా నిలుస్తోంది. శనివారం ఉదయం పొలం పనులకు వెళ్లగా పొలంలో పాము కాటు వేసింది. హుటాహుటిన తోటి కూలీలు వైద్యానికి చిలకలూరిపేటలోని ఓ ప్రవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం చనిపోయింది. మృతురాలికి భర్త, ఒ కుమారుడు, కుమార్తె ఉన్నారు. గ్రామంలో అందరితో కలివిడిగా ఉండే మల్లేశ్వరి.. పాము కాటుకు బలి కావడంతో కుటుంబ సభ్యులు, తోటి కూలీల్లో విషాదఛాయలు అలముకున్నాయి.

పల్టీ కొట్టిన టిప్పర్.. తప్పిన పెను ప్రమాదం


కారంచేడు-కుంకలమర్రు రోడ్డులో ప్రమాదానికి గురైన టిప్పర్

కారంచేడు: కాలువ కట్టమీద ప్రయాణించే సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయిన టిప్పర్ లారీ కొమ్మమూరు కాలువ అంచుకు పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో టిప్పర్ లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా పెను ప్రమాదం తప్పింది. వాడరేవు–పిడుగురాళ్ల ప్రధాన రహదారి 167/ఏ కి గ్రావెల్‌ను తరలిస్తున్న టిప్పర్ లారీ అదుపుతప్పి ఆదివారం బోల్తా కొట్టింది. కారంచేడు నుంచి కుంకలమర్రు వైపు వెళ్లే రహదారి కొమ్మమూరు కాలువ కట్టమీదగా ఉంటుంది. ఈ కట్ట మీద ప్రయాణించే సమయంలో ఎదురుగా మరో వాహనం రావడంతో రోడ్డు మార్జిన్ దిగిన టిప్పర్ లారీ అప్పటికే వర్షం కురిసి ఉండటంతో మార్జిన్ నానిపోయి మెత్తగా తయారైంది. దీంతో టిప్పర్ లారీ అదుపు తప్పి బోల్తా కొట్టింది. డ్రైవర్ చాకచక్యంగా తప్పించుకున్నాడు. ఎన్‌హెచ్‌ఏఐకి చెందిన పొక్లెయిన్ ద్వారా వాహనాన్ని తీయించారు.

సామాజిక సమస్యలను స్పృశించిన నాటికలు


సురభి ప్రభావతికి జీవితసాఫల్య పురస్కారం ప్రదానం


'అ సత్యం' నాటికలో సన్నివేశం

తెనాలి: రూరల్ మండల గ్రామం కొలకలూరులో కొలంకపురి నాటక కళాపరిషత్, శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సంయుక్త నిర్వహణలో జరుగుతున్న ఉభయ రాష్ట్రస్థాయి 11వ ఆహ్వాన నాటికల పోటీలు ఆదివారం ముగిశాయి. చివరిరోజున డాక్టర్ రమణ యశస్వి, డాక్టర్ కొచ్చెర్లకోట జగదీష్ జ్యోతిప్రజ్వలనతో ప్రదర్శనలను ఆరంభించారు. తొలుత చైతన్య కళాస్రవంతి, ఉక్కునగరం, విశాఖపట్నం వారి 'అ సత్యం' నాటికను ప్రదర్శించారు. మనిషి సత్యం చెప్పినా అబద్ధం ఆడినా దానివెనుక ఏదొక భయమో? స్వార్థమో ఉంటుంది. దానివల్ల అతడికి మేలు జరగొచ్చు లేదా కీడు కలగొచ్చు. నిజానికి యదార్థమైనా ఒక చెడుకు దోహదపడితే అది అసత్యం...అబద్ధమైనా ఒక మంచికి తోడ్పడితే అది సత్యం...అనేదే నాటిక సారాంశం. సుధ మోదుగు కథను పిన్నమనేని మృత్యుంజయరావు నాటకీకరించారు. పి.బాలాజీనాయక్ దర్శకత్వంలో ప్రదర్శించారు. దర్శకుడు బాలాజీనాయక్‌తోపాటు పి.రామారావు, వై.అనిల్‌కుమార్, ఎం.వాసు, థబుూమస్, ఎస్.మాధవి నటించారు. తదుపరి లలిత శ్రీ కళాసమితి, శ్రీకాకుళం వారి 'మతమా...మానవత్వమా?' నాటికను ప్రదర్శించారు. మతం అనేది ఎప్పటికీ శాశ్వతం కాదనీ, మానవత్వమే శాశ్వతమని. మనిషికి మానవత్వమే ప్రధానమని, అదే నిలిచి వెలుగుతుందని సందేశాన్నిచ్చిందీ నాటిక. కంచర్ల సూర్యప్రకాశరావు రచనను ఎల్.రామలింగస్వామి దర్శకత్వంలో ప్రదర్శించారు. ప్రధాన పాత్రల్లో బోసుబాబు, కేతిరెడ్డి రాజేశ్వరి, గుత్తు రవిబాబు, ప్రసాదవవు, లక్ష్మణరావు, కామేశ్వరరావు నటించారు. చివరగా శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు వారి 'జనరల్ బోగీలు' నాటికను ప్రత్యేకంగా ప్రదర్శించారు.

సురభి ప్రభావతికి జీవితసాఫల్య పురస్కారం

ఇదే వేదికపై యడ్లపాడు 'వేదిక' పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు అధ్యక్షతన గోపరాజు బాలాత్రిపుర సుందరమ్మ జీవిత సాఫల్య పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. ప్రముఖ రంగస్థల, టీవీ, సినీనటి సురభి ప్రభావతికి ఈ పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ చేతులమీదుగా ప్రదానం చేశారు. ప్రముఖ రూపశిల్పి ఎం.మదన్‌మోహన్ స్మారకంగా పసుమర్రుకు చెందిన రంగస్థల రూపశిల్పి పచ్చల శేషగిరిని సత్కరించారు. వివిధ కళాపరిషత్‌ల బాధ్యులు నూతలపాటి సాంబయ్య, వల్లూరు శివప్రసాద్, చాగంటి నాగేశ్వరరావు, కల్వకొలను అనంత్, గోగిశెట్టి వర్మ మాట్లాడారు. నిర్వాహక సంస్థల బాధ్యులు గోపరాజు రమణ, గోపరాజు విజయ్, సుద్దపల్లి మురళీధర్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.